"ది విశాఖపట్నం రోడ్డు యూజర్స్ నష్టపరిహారం యాక్ట్" అని ఒక చట్టం చేయించ గలిగితే:- మినహాయింపు లేకుండా అన్ని రోడ్లమీద యాభయ్యేసి అడుగులకి ఒక గొయ్యి చప్పున ఉండడం వల్ల:

రైల్వే స్టేషన్ జంక్షన్, చావుల మదుం జంక్షన్, నేవల్ డ్రైడాక్ రోడ్డు, కొబ్బరి తోట బైపాస్ రోడ్డు లాంటి ఎన్నో చోట్ల తారురోడ్లు అలవాటుగా వర్షంలో కొట్టుకుపోతూ ఉండడం వల్ల,

తమ ఇళ్లకి కుళాయిలు పెట్టించుకునే సందర్భంగా గొట్టాలు రోడ్ల కింద నుంచి రావాలి గనుక రోడ్ల భాగాల్ని అడ్డంగా పగల గొట్టిన వాళ్లు తిరిగి ఆ భాగాల్ని సరిచెయ్యలేకపోవడం వల్ల, రోజూ ఎన్నో వాహనాలు టైర్లు పగిలి, రిమ్ములు వొంగి, షాక్ ఎబ్సార్బర్లు విరిగి మెకానిక్కుల దగ్గిరికి చేరుతున్నందుకు-

రోజూ ఎందరో మనుషులు (వాహనాల వాళ్లే కాకుండా నడుస్తున్న వాళ్లు కూడా) ఆ గోతుల్లో పడి కీళ్లో కాళ్లో విరగ్గొట్టుకుని డాక్టర్ల దగ్గిరికి చేరుతున్నందుకు-

మున్సిపల్ కార్పొరేషన్ వారు కోట్లాది రూపాయలు నష్టపరిహారం కింద చెల్లించుకోవలసి వస్తుందేమో -

మేయర్ గార్ని ఎప్పుడేనా కలిసి అడగాలి. ఆయన గొప్ప ఎడ్వకేట్. "మేయరు" అని కూడా ప్రతీతి. (వెనక ఒకాయన ఉండేవారు. ఆయన మేస్టారు.") ★

# 5. నందికేశ్వరుడి నోము

"మీ కుటుంబం మొత్తం ఐదుగురూ తప్పకుండా రావాలి మరి!" అని రెండు చేతుల్తోనూ పట్టుకుని మరీ అందించేడు నా స్నేహితుడు నందికేశ్వరరావు, తన కూతురి పెళ్లి శుభలేఖని.

"అలాగే వస్తాంలే. ఐదుగురూ అంటే పిల్లలు ముగ్గురి సంగతీ గట్టిగా చెప్పలేను గాని నేనూ మా ఆవిడా ఖాయంగా వస్తాం."

"అలాక్కాదు. ఐదుగురూ రావలసిందే!"

"ఎందుకంత యిదిగా చెప్తున్నావు? వస్తాం అన్నానుగా!"

"అలాక్కాదు. మా ఆవిడ నందికేశ్వరుడి నోము పట్టింది అందుకని-"

"మీ ఆవిడ నందికేశ్వరుడి నోము ఇప్పుడు పట్టడమేమిటి; పాతికేళ్లయిందిగా!" అన్నాను నవ్వుతూ; అతని పేరు నందికేశ్వర్రావు కదా అని.

"ఆ నోము కాదోయ్!" అని నందికేశ్వర్రావు కూడా నవ్వేడు. "ఏదో పాతకాలం మనిషి. ఒద్దే అంటే వినదు! నందికేశ్వరుడి నోము తొమ్మిది భాగాలుట. అందులో పరమాన్నం, అప్పాలూ ఉండిపోయాయిట, ఈ పెళ్లిలో అవి రెండూ అయిందనిపించేస్తుందిట-"

ఆ విధంగా నందికేశ్వర్రావు కూతురి పెళ్లికి మేం ఇంటిల్లపాది వెళ్లేం. పరమాన్నం, అప్పాలూ పారెయ్యకుండా వీలున్నంత మేరకి తిని ఆవిడ నోముకి సహాయపడ్డామని తృప్తిగా వొచ్చేస్తూవుంటే

నందికేశ్వర్రావు గేటు దగ్గిర వీడ్కోలు చెప్పే నెపంతో కాసి, ఒకానొక పుస్తకం నా చేతిలో పెట్టి "థ్యాంక్స్" అన్నాడు. పుస్తకం అతనిచ్చినందుకు థాంక్స్ అన్నమాట నేనే అనాలేమో అని తెరచిచూద్దునూ; "లీలామానుష హేల -పద్యకావ్యం; రచన: శ్రీ నందికేశ్వర్రావు!"

"ఇదేమిటీ; నువ్వు పోయట్రీ రాస్తావా? నాకు తెలీదే?" అన్నాను.

"నాకూ తెలీదు. అంతా ఆ లీలా మానుష విగ్రహుడి హేల." అని రెండు చేతులూ పైకెత్తి దండం పెట్టి; మళ్లీ ఇలా అన్నాడు నందికేశ్వర్రావు: "ఆమధ్య తిరుపతి వెళ్లినపుడు అక్కడ మన క్లాస్మేటు కడిమిశెట్టి వెంకటేశులు కనిపించి 'నువ్వు మత సంబంధమైన పుస్తకం ఏదైనా ఒకటి రాసి ప్రచురణకి గ్రాంటుకోసం దరఖాస్తు చేస్తే ఇప్పిస్తా' నన్నాడు. సరేకదాని ఓ నెల్లాళ్ల రాత్రిపూట కూర్చుని మూడువందల యాభై పద్యాలు రాసేను. అదే ఈ పుస్తకం. దీనికి ఖర్చయిన మూడు వేలల్లో రెండు వేల నాలుగు వందల గ్రాంటు వచ్చింది కనుక నా చేతిని పడ్డది ఒక్కొక్క కాపీకి అరవై పైసలే. అందుకని తెలిసిన వాళ్లందరికి ఊరికే ఇచ్చేస్తున్నాను. మా అమ్మాయి పెళ్లి ధర్మమా అని రెండు వందల యాభై కాపీలు ఖర్చయ్యాయి. ఆ మూల జాగా అంతా ఖాళీ అయింది!" అని వివరించేడు నందికేశ్వర్రావు.

"పదిహేను వేల కట్నం మాత్రం ఇచ్చి అమ్మాయిని వదిలించుకున్నావు. పెళ్లి సందర్భంగా వచ్చిన గెస్టుల ద్వారా మీ ఆవిడ నోము అయిందనిపించేవు. పైగా నీ కవిత్వంపుస్తకాలు కూడా కాణీ పోస్టేజీ ఖర్చుపెట్టకుండా ఇంటింటకీ చేరవేశావు. వారెవా! ఒక్క దెబ్బకి మూడు పక్షులు!!" అని అతని జెబ్బ చరిచేను.

అక్కణ్ణుంచి ఇంటికొచ్చేసరికి ప్రభుత్వం వారి ఒకానొక శాఖనుంచి ఒక ఉత్తరం, ఒక ఆహ్వానం వచ్చేయి. "ప్రతి ఏడాది వలెనే ఈ ఏడాది కూడా నవంబర్ నెలలో ఆరురోజుల పాటు మా ప్రాంగణంలో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. సదరు ఆరురోజులలో వొకరోజు కథానికా సమ్మేళనం పెడుతున్నాం. అందులో మీరు పాల్గొనగలరు."

-అని, ఆహ్వాన పత్రంతో పాటు వచ్చిన ఉత్తరం అది. ఆరురోజుల కార్యక్రమం ముద్రించిన ఆహ్వానపత్రంలో ఒక రోజున నాపేరు కూడా వేసేరు. మళ్లీమరోసారి నాపేరు అచ్చులో చూసుకుని మురిసిపోయి; ఆ రోజుకి ఒక కథ పట్టుకెళ్ళాను.

గోపాలక్రిష్ణ అని, నాక్లాస్మేటు. అతను ఆ ప్రభుత్వ శాఖలో స్థానిక అధికారి. సమావేశం మొదలవడానికింకా టైం వుంది కదాని అతన్ని రూమ్‌లోకెళ్లి పలకరించాను. 'వెల్‌కం! నువ్వు వస్తావా రావా అని బెంగపెట్టుకుని చస్తున్నాను. మరి నువ్వు అంగీకార పత్రం పంపలేదు!"అన్నాడు.

"అంగీకార పత్రం పంపమని మీ ఉత్తరంలో లేదే!?" అన్నాను.

"నిజంగా?" అన్నాడు గోపాలక్రిష్ణ.

నేను, మాట్లాడకుండా, నాజేబులోంచి వారి ఉత్తరం చూపించేను. "చూసేవా? ఇదే వీళ్లతో గొడవ! టైపు కొట్టిన ఉత్తరాల్లో కంటే చేత్తో రాసినవైతే ఆత్మీయంగా ఉంటాయని అందరికీ చేత్తో రాయమంటే నీ దాంట్లో రెండో పేరాగ్రాఫు రాయడం మరచిపోయేరు - ఈ ఉత్తరం అందిన వెంటనే మీ అంగీకారం తెలియజేయవలెను - అని, ఆ రెండో పేరా," వివరించాడు గోపాలక్రిష్ణ

"అసలు, అంగీకారం అంటూ రాయడానికి టైమేదీ? ఈ ఉత్తరంతో పాటే, అచ్చువేసిన ఆహ్వానపత్రం కూడా నాకు చేరింది. అందులో నా పేరు ఉండనే ఉంది కదా. ఆమాత్రం దానికి నేను మళ్లా అంగీకార పత్రం అసలు రాయడం దేనికని మానేశాను!"

"పోన్లేవయ్యా. ఏదో నామీద దయతల్చి వచ్చేవు, అంతేచాలు! కూర్చో. ప్రోగ్రాం టైం ప్రకారం మొదలెట్టేస్తాం. మొత్తం ఆరుగురు కథకులు కదా. ఆరుపదులు అరవై నిమిషాలు - అంటే ఒక గంట. అంతే, బస్! అయిపోగానే మీ ఆరుగురికీ సన్మానాలు చేసెయ్యడం; ఆ తరువాత ఆరుబయలు రంగస్థలంలో "తెలుగు ప్రశస్తి" - బుర్రకథ - అంతే. బుర్రకథకి నువ్వు ఉండకపోయినా పర్వాలేదనుకో-"

"సన్మానం అన్నావేమిటి?"

"బలేవాడివి, మా ప్రాంగణానికి వచ్చి మీ ఆరుగురూ కథలు వినిపిస్తున్నందుకు జ్ఞాపకార్థం ఏదో ఒకటి ఇవ్వాలి కదా. దాన్నే సన్మానం అన్నానంతే."

"శాలువాలు కప్పుతారా?"

"అబ్బే, అంత బడ్జెట్ లేదయ్యా. పుస్తకాలు ఇస్తాం, అంతే"

"పుస్తకాలా? పోన్లే, మంచి పుస్తకం నీడన మనసంతా చల్లన - అన్నారు"

"అన్నట్టు మరచిపోయేను; మా అసిస్టెంట్ దగ్గరికెళ్లి ఈ రోజు పంచిపెట్టే పుస్తకాలు చూడు." అని బెల్ కొట్టి, ఒక ప్యూన్‌ని పిల్చి; పక్కరూమ్‌కి నాకు తోడు వెళ్లమన్నాడు గోపాలక్రిష్ణ.

అక్కడ ఆరు కవర్లు కట్టి వున్నాయి. ఆరింట్లోను పుస్తకాలున్నాయి. కవర్లు ఇంకా సీలు వెయ్యలేదు; పైన పేర్లు మాత్రం రాసేరు. నేను ఫలానా అని చెప్పి; "చూడొచ్చా?" అన్నాను.

"ఓ, ష్యూర్!"

ఆశ్చర్యం! ఆరుకవర్లలోను "లీలామానుష హేల" ఒక్కొక్క కాపీ చొప్పున ఉన్నాయి! ఈ లోపుగా తేజేశ్వరరావని, ఇంకో కథకుడు వచ్చాడు; అతనూ చూసేడు అవి. "నేను గత మూడేళ్లుగా ఈ సమావేశాల్లో పాల్గొంటున్నాను. తొలి ఏడాది ఒక నిఘంటువు ఇచ్చారు. రెండో మాటు సర్వేపల్లి రాధాకృష్ణగారి వ్యాసాల పుస్తకం ఇచ్చారు. కిందటేడాది "ఆంధ్రదేశంలో పత్రికా ప్రచురణా ఉద్యమం" అనే పుస్తకం ఇచ్చేరు. మరి ఈ యేడాది - ఇదేదో పుస్తకమే గాని, అంత పనికొచ్చేదిగా కనబడ్డం లేదు -" అన్నాడు.

"ఔను సార్, ఈ ఏడాది బడ్జెట్ తగ్గించేశారు. పైగా, ఈ నందికేశ్వర్రావు గారు సరాసరి హైద్రాబాద్ వెళ్లి మా హెడ్డాఫీసు వాళ్లకి నచ్చజెప్పి తన పుస్తకం ఇలాంటి కవిసమ్మేళనాల్లో వాడడానికి బావుంటుందని ఒప్పించి, కన్సెషన్ రేటులో మొత్తం ఐదువందల యాభై పుస్తకాలు కొనే ఆర్డర్ వేయించుకున్నారు. ఫలితంగా, ఈ ఆరురోజుల్లో ఇక్కడ కవిసమ్మేళనాల్లో పాల్గొనే ఇరవై నలుగురికే కాక; మొత్తం రాష్ట్రంలో వున్న ఇరవైమూడు జిల్లాల్లో ఈ ఆరురోజుల కవిసమ్మేళనాల్లో పాల్గొనే ఇరవై నాలుగేసి మందికీ ఈ పుస్తకమే వస్తుంది. ఇందులో మా తప్పేమీ లేదు" అని గోపాలక్రిష్ణ అసిస్టెంట్‌గారు వివరణ ఇచ్చేరు.

నందికేశ్వరుడి నోములో ఒక్క దెబ్బకి నాలుగు పక్షులు! ★